# వింతమార్పు ★

శ్రీ. జ. వెంకటరావు.

ప్రభూ! దీనంగాయున్నది పిలుపు. ప్రభాకరుఁడు వెనుదిరిగి చూచేఁడు. చెప్పరాని ఆవేశానికి లోనయ్యేఁడు. తీరని జిజ్ఞాసలో చిక్కుకున్నాఁడు. తనకే విచిత్రమనిపించింది, యీ వింతమార్పుకి. ఒక సమయము తను యీ చిరుపిలుపుకి ఉబ్బూతలూగేవాఁడు. ఈ దర్శనానికి పవలు రాత్రి యేకముచేసేవాఁడు.

ఇప్పుడో ఆమె చాయనుచూస్తే భయపడుచున్నాఁడు. కారణము, జీవిత చక్రములో ఓవింత మార్పు. కమల యెంత అమాయకపు పిల్ల, ఎంత విజ్ఞానవతి, ఎంత వినయవిధేయతలు, ఆమె నడతలో, ఆమె హృదయ మెంత నిర్మలమైనది. ప్రేమ స్వరూపిణి, సౌందర్యముగ్ధ.

ప్రభాకరునికీ తెలుసు. ఒకప్పుడామెతోనే అనేవాడు. కమలా! నాహృదయము నీ బాహ్యాడంబరమునకు కాదు, పవిత్రమైన నీహృదయానికి లోనైపోయింది అని.

కమలకే తెలును, ప్రభూ హృదయము పవిత్రమైనదని. అందులో యేమాత్రము స్వార్థము యీష్యలేదనిగాని, ఆమె భయము ప్రపంచముతోనే, వెధవసంఘము, తనకేమిటో ఈచూడని తనము.

తన సర్వస్వాన్ని ప్రభూకి ధారపోసింది. స్వతంత్రజీవి, పురుషునిలాగ ఆమెకూడ సంపాదిస్తూంది. పనిచేస్తుందని కొందరు లోకువగా చూసేవారు కాని ఆమె వెఱువదు "స్వేచ్ఛా జీవులు తుచ్ఛసంఘానికి వెరువరు."

ఎంత విచిత్రముగా కలిసింది, ప్రభుతో స్నేహము. ఆసంఘటన తలంపుకు రాగానే యెంత మురిసిపోయేది. తనలో తనే నవ్వుకునేది. ప్రభూ ఎంత అమాయకుఁడు. తనతో మాట్లాడేఅందుకు ఎంత బిడియపడేవాఁడు. స్త్రీఅయియుండి కూడ, ఆమెముందడుగు వేసేది. ప్రభూ ఆ అమాయకత్వమే తననీ స్థితికి తీసుకువచ్చింది. గంటల తరబడిగా మాట్లాడేది. ఆ తరువాత అందులో ఏదో చెప్పరాని ఆనందము, ఉత్సాహము పొందేది. పేదవానికి పెన్నిధిలా ఆమె మెదడుఆనందముతో ఉప్పొంగిపోయేది. Exchange బోర్డు యేమైనాసరే, ఆమెకు భయమనేది లేకపోయేది. ప్రభూ నామోచ్ఛారణే ఆమెకు నిద్రాహారాలయ్యేది. ప్రభూ మాటలలోనే లీనమైపోయేది. వింత ఆకర్షణ తనతో పనిచేస్తున్న ప్రతిఆపరేటరు, యెన్నో మాటలనేవారు "ఇన్నిరోజులుబట్టి పనిచేస్తున్నాము గాని ఈలాంటి పిచ్చిపనులెప్పుడూ చేయలేదు" అని. రోజులు గడచిన కొలది హృదయారాట మెక్కువయింది. మాటలుఁకలిసిన కొలది భావాలు పెంపొందేయి. ఆసర్వాంతర్యామికి ఎన్నో నమస్కృతులర్పించింది, తన ప్రభూ కొఱకు. ప్రభూ ప్రతి పలుకు ఆమె జీవితములో ఒక వెన్నెలై విరజిల్లేది. ప్రభూ ప్రతి చలనము ఆమె హృదయ బాటలో ఒక కదలికయై నడచేది. వింతప్రేమ, వింతమార్పు. తన మార్పుకు తనే ఆశ్చర్యపడేది. అసలు ప్రభూ ఎవరు, తానెవరు. ఈ రెండు బాటలు ఎంత దూరంనుండి అకస్మాత్తుగా కలిసేయి, ఎంత గాఢబంధనమునను కారణమయేయి. ఏమిటో, ప్రభూకూడ తన్ను ఇంత అధికముగా వాంఛిస్తున్నాడా. అసలు తన్ను ప్రేమిస్తున్నాఁడో లేదో కూడ తెలీదు, కాని ఈ ఆకర్షణ! తల్లి దండ్రీ, బంధువులు ఇప్పుడు తన ప్రభూ ముందు ఒక తృణప్రాయములానున్నారు. నలుగురూ అనుకోవడమే గాని ఆమెకు ప్రేమ అంటే ఇంతకు ముందు తెలీదు. "ప్రేమించే ప్రతి వ్యక్తి పశువృత్తికి లోబడి అది ప్రేమయనే మిషతో తన కామాన్ని వివిధ రూపా

లుగా గ్రోలుతారు" అని అనుకుంటేది. ప్రకృతిని ఋజువుగా తీసికొని యువతీ యువకులు చేసే ఘోర అన్యాయములను వినినప్పుడెల్లా ఉద్రేకపూరితురాలయ్యేది. ఎంత అవివేకులు అనుకుంటేది. ఇంత చదువు చదివి వీరు ఆఖరికి నీచకామవృత్తికి ఆహుతి చేస్తారు. స్త్రీకూడ పురుషునివలె సమానురాలై పురుషుఁడనుభవించే ప్రతి హక్కును పొందాలని వాదనలాటేది, ఆ అమాయకపు అబల.

ప్రభూని చూచిన వారంతా ఎంత మురిసిపోతారు. ఎక్కువగా తనతో పనిచేస్తూ ఉన్నవారు మరీని. ఆ నొక్కు నొక్కుల జుట్టు, ఆ తీర్చి దిద్దిన ముక్కు, ఆ కళ్ల సోయగము, ఆ ముఖ వర్చస్సు, పొడవుతగ్గట్టు దేహకట్టు, నలుపన్న దేమిటో తెలియని ఆ శరీరచ్ఛాయ, ఆ మాటలలో, ఆ నడకలో ఎంత మర్యాద ఊడిపడుతుంది. ఏమిటో యీ అసూయ, నేనాయనకు తగనట. రామచిలుకకు మసిబొగ్గు కట్టినలా" ఇంకా ఏంటేంటో సామెతలు పొడుస్తారు. ఒకరేంటి అందరునూ. గాని వీరి అభిప్రాయము ? ఎంతో ఆలోచించేది. గంటలతరబడిగా బుఱ్ఱ పాడుచేసుకునేది. నిజంగా ఆమె అంత అనాకారియా? లేదా? ప్రభూ దగ్గర నిలబడేందుకుకూడ ఆమెకు అర్హత లేదేమో. ఇది ఆమె తప్పా? తన్ను పుట్టించిన ఆ సృష్టికారునిదో లేక తల్లి దండ్రులదో.

కాని ఇది స్వార్థప్రపంచము. పవిత్రప్రేమకు తావు లేదు, నిర్మల హృదయాలకు నీడలేదు. జీవిత సౌఖ్యాలను తూనికలో పెట్టి తూచుతారు. చదువుకున్నవారు కూడ అంతే. సంఘ సంస్కర్తలు కూడ అంతే. తనవరకు రాకమునుపే ఎన్నో ఉపన్యాసాలిస్తారు. భారత సంస్కర్త అని బిరుదులు మాత్రమే చిరస్థాయిగా ఉంటాయి. క్రియలలో లేశమైనా ఫలితము కాన్పడదు. వారి హృదయము మొక బండరాతిలా ఉంటూంది. దయాదాక్షిణ్యాలు ఎప్పుడూ విననట్టుగా ప్రవర్తిస్తారు. మాటు మణిగితే మనుగు కుళ్ళిపోయిన ఈ పెద్దలే మన జీవిత భావి నాకలకు అధికారులు. వారిచేతులలోనే మననూకళ్ళ బ్రతుకూడ. జాతులు, మతాలు, చిన్న పెద్ద, బీద గొప్ప, వరసవాడి, అబ్బా! ఎన్ని సమస్యలు పెట్టేరు, మము పరిష్కరించేందుకు. ఇవన్నీ స్థిరపడితేగాని ఏవ్యక్తికి ప్రేమించేందుకు అర్హతలేదు. ఆఖరికి కులాసాగా మాట్లాడేందుకు కూడ హక్కులేదు.

ఆరోజెంత ప్రశాంతముగా నున్నది, ప్రకృతి. ప్రభూ, తనూ ఒంటిగా కూర్చున్నారు. కొంత వఱకు మౌనముగాయున్నది, వాతావరణము. సిగ్గుకాదు కారణము, అమిత ఆనందము, ఉత్సాహము, గొంతు ముడివఱకు వచ్చిఆగిపోయేది భావన. ఎంతహాయిగా ఉన్నది, ఆ కలయిక. ప్రపంచములో తనకంటే అదృష్టవంతురాలు లేదనుకుంటేది. ప్రభూ మొదలిడేఁడు. రెండు కండ్లు అప్పగించి అమాయకముగా చూస్తుంది కమల.

"కలూ! ఈ వుద్యోగము నీ కెలా అనిపిస్తూంది?"

'ఏమీ? వింతప్రశ్న వేశేరు" ఆశ్చర్యముగా అన్నది.

"అబ్బే, మాటవరుసకి, నీఅభిప్రాయము తెలిసికొనేందుకు" చిన్న చిరునవ్వుతో నసిగేఁడు ప్రభూ.

"ఆ, అది పనిచేసే వ్యక్తులమీద ఆధారపడి ఉంది. ప్రభూ! వ్యక్తుల వివిధ ప్రవర్తనల ఫలితాలు అనేకరూపాలు పొందుతాయి, కాని మనము నిర్మలముగా ఏ ఇతర విషయములతోనూ జోక్యము లేకుండా, మర్యాదగాపోతే దీనికి మించిన ఉద్యోగము లేదనుకుంటాను. ఇప్పటి స్త్రీలకు కడుపులో చల్ల కదలకుండా తన్నుతాను పోషించుకునేందుకు ఉత్తమమార్గమనిపిస్తూంది నాకు.

"ఎప్పుడూ యిలానే కాలము గడపాలని వుందా?

ఇప్పుడు ఆలోచనలో పడ్డాది కమల. ప్రభూ యొక్క యీకొంటి ప్రశ్నకు యేమి జవాబు చెప్పాలో, ఎలా మొదలిడితే తన హృదయాన్ని విప్పిచెప్ప

గలదో, భావాలు సముద్రపు అలలలా ఒకంబడి ఒకటి రాపిడము మొదలిడేయి. ఆఖరికి ధైర్యము చేసి అనేసింది—

“మరి కర్తవ్యము” లేదు ప్రభూ తనకు తెలుసునా, ప్రభూ హృదయము నొప్పి పెడుతుందని.

“నీవువట్టి పిచ్చిపిల్లవు కలూ,” కర్తవ్యాలు మనల నన్వేషించవు, మనము కర్తవ్యాలను పరిశోధించాలి. “నీవు విద్యావతివి. ప్రపంచపు మంచి చెడ్డలలో పాల్గొన్నావు, దేశచరిత్రను పఠించి, జీవిత మార్గాలను తెలుసుకున్నావు. సంఘములో స్వతంత్రముగా బ్రతుకుతున్నావు. యవ్వనపు లోతులను బాగుగా గ్రహించావు. నీకొకరు చెప్పాలా, నీబాగోగులను నీవు పరిష్కరించుకోవాలి. గాలిలో జ్యోతిని పెట్టి కర్మమీద ఆధారపడితే నిలబడుతుందా.”

సముద్రపుమధ్య నల్లాడుతున్న వానికి గడ్డిపూచ ఊత దొరికినవారిలా కనిపించిందామెకు—

“గాని ప్రభూ! ఇది భవసాగరము. దీనిలో ఈదేటందుకు తగిన నావ కావాలి, తగిన ధైర్యము కావాలి. అంతా అగమ్యగోచరంగా ఉంది. నావంటి అభాగ్యురాలికి ఎవరు సహాయమిస్తారు. ఎవరిని ‘నా’ అని సంబోధించేందుకు హక్కున్నది.

కంట తడిపెట్టింది, ఉద్రేక మువ్పొంగింది. ప్రభూ ఆ దృశ్యము చూడలేకపోయాఁడు. ఒక్కసారిగా తనలో దాక్కొనియున్న కరుణ, పైకి ఒలికింది. ఆమె అమాయకత్వము, నిర్మలత్వము, అతనిని ఒక ఆటవస్తువుగా చేసేయి.

“కలూ! ప్రపంచాన్ని అర్థముచేసుకో. ప్రపంచమంతా స్వార్థమయముతో నిండిపోలేదు. దానిలో మన్నారు, వ్యక్తులు. కాని వారిని అర్థము చేసికోవడములో ఉంది.” చలోక్తిగా విసిరేడీ మాట ప్రభూ.

“అర్థము చేసికొనిన మాత్రాన అందవద్దు ప్రభూ, పిచ్చిభ్రమలు పెట్టుకున్నంత మాత్రాన తీరవద్దు.” నిరాశతో కూడుకొనియున్నది యీ మారు స్వరము.

“మానవ ప్రయత్నమన్నది ఒకటి వున్నాది కదూ” పురుషు లెంత కఠినహృదయులు!. ఊరించి చంపుతారు. లోతుగుండెలంటే వారికే అనుకుంటాను.” ఎంతటి అమాయకులు మీరు పాపము. చరిత్రలన్ని మొదలుపెట్టి, అంతము చేసినవారు స్త్రీలో, పురుషులో తెలీదా! పోనీ ‘ప్రేమ’ అంటే యేమిటి కలూ.”

“అదే ప్రశ్న మిమ్మల్ని అడగాలని సందేహిస్తున్నాను.”

“స్వచ్ఛమైన ప్రేమ యిప్పటి వ్యక్తులలో ఉన్నాదని నమ్ముతావా!”

“అనుభవములోనికి వచ్చిన తరువాత నమ్ముతున్నాను ప్రభూ.”

“అనుభవమా? ఆ పుణ్యాత్ము డెవఁడు కలూ?”

“మీరే చెప్పాలి.”

“నేను చెప్పగలిగితే నిన్నడగడ మెందుకు.”

“అబ్బా! మీరెంత గడుసువారు. నాతో చెప్పించాలనే పట్టుదల? మీ హృదయాన్ని అడగండి. నిష్కళంకమైన మీకండ్లు నడగండి. అవి యెంత పవిత్రమైనవి. మీరు దాచినా అవి బయటపెడతాయి.”

“కలూ! నిజంగా చెప్పు. నా అభిప్రాయము నిజమేనా, నా భావాలు సత్యమేనా, నా కోర్కెలు సఫలమౌతాయా.”

ఆనందముతో నయన బాష్పములు నిండేయి. ఇక ముందికి సాగలేక పోయాఁడు. అన్నిటికి బుఱ్ఱ ఊపుతూ అలానే వుండిపోయింది కమల. అదియొక సుదినము, ఆమె జీవితములో. స్నేహము వింతత్రోవ పడ్డాది. ఇక నాలోచించలేక పోయింది. అదియొక మధురస్మృతి, ఆ దినాలొక భ్రమలా కనబడ్డాయి. అదియొక హాయిస్వప్నములా గోచరించింది.

అలాంటి ప్రభూ యింతలో ఎలా మారిపోయేఁడు! ఎంత కఠినహృదయుఁడై పోయేఁడు. తన్ను చూడకుండా ఒక్క క్షణమైనా ఉండలేక పోయే

వాడు. అప్పుడు తన పేరు వింటేనే భయపడతాడు. దీని కెవరు కారకులు? విధియా లేక విష పురుగులా?

ఆ రోజు ఎంత మరచినా మరపు రాకుండా ఉన్నది. తన ఒల్లు తెలియకుండా పండుకుంది. తల నొప్పి, దానికి తోడు అమితముగా చలి జ్వరము. తనతో పనిచేస్తున్న వదిన, యింక యెంతోమంది వచ్చారు. అనేక రకాలుగా ధైర్యమిచ్చేరు. ఏవేవో సపర్యలుకూడా చేసేరు. కాని తనకొకటే భయము, ప్రభూను చూడకుండ చచ్చిపోతానేమోనని. ఏమిటో ఆ పిచ్చి భ్రమ. ఆఖరి కోర్కె అదొక్కటేలా నిపించింది. దురదృష్టవశాత్తు ప్రభూ ఆదినము కలకత్తా వెళ్లేడు. తను పడిన వేదన, రాత్రి వరకు బ్రతుకు తానో లేదో నన్న అపనమ్మకము; జబ్బు అంత తీవ్రము కాకపోయినా కోర్కె మనస్సును బాధించేది, భ్రమ హృదయాన్ని ఛేదించేది. క్షణభంగురమీ దేహము. ఇన్ని ఆశలు మట్టిలో కలసిపోవలసిందే.

ఎలాగో గడచింది ఆ దినము. హృదయము తత్తరపడింది ప్రభూ వచ్చేడు. ఎంత గాబరా పడ్డాడు తన అవస్థను చూచి. అప్పుడు ప్రభూను చూడగానే యెంత దుఃఖమనిపించింది. అమాయకంగా కన్నీళ్లతో తన ప్రక్కను కూర్చొని, తల నిమురుతూ ఉంటే తను యీ ప్రపంచములోనున్నదో, మరెక్కడనున్నదో అనిపించింది. నొప్పంతా యిట్టే మాయమయింది. ఎంత ఆదరణతో అడిగేడు— "కలూ, ఒక్కదినానికే ఎలా అయిపోయేవు. ఇంత ధైర్యములేకపోతే ఎలా? చిన్నఅమ్మాయిలా మంకు పట్టు పట్టితే ఎలా? మందు త్రాగితే గాని జబ్బు ఎలా బాగవుతుంది? ఒక్కసారిగా లంఖణముచేస్తే యెంత అశక్తి అవుతుంది? ఒకటేమిటి వంద కుశల ప్రశ్నలు వేశేడు.

ఆయన ఉదారత్వాన్ని అలా చూస్తూనే ఉండి పోయేను. ఎన్ని చెప్పినా వినక ఏంటేంటో తీసుకు వచ్చేడు. డాక్టరుని ఎన్నో ప్రశ్నలు వేశాడు. భయము లేదు కదా? ఈ రాత్రి కేమి ప్రమాదము చెయ్యదు కదా? ఆయన భయము ఆ ప్రేమ నా హృదయాన్ని మహాసముద్రము చేసేయి. నేను నిజంగా చచ్చిపోతే ప్రభూ యేమైపోతాడో? పిచ్చివాడై పోడు గదా! నేను ఎంత కృతఘ్నురాలను. ఈ ప్రభూనే నేను శంకించేను. తీరని అపచారము చేసేనని చెప్పింది నాహృదయము. ప్రభూ సుఖము కొఱకు నా ప్రాణా లర్పించినా, ఋణము తీర్చుకోలేనేమో ననిపించింది. అలాంటి తన అమాయకపు ప్రభూ యీ దిన మెంత బండ అయ్యేడు. పిలుపుకు జబాబైనయిచ్చేందుకు అశక్తుడైఉన్నాడు.

ప్రభూ, మా చెల్లాయి ఎక్కడ నున్నది. సాంకేతికముగా చూపెట్టేడు ప్రభూ, ఎదురుగా నున్న గదివైపు. కమలకి తెలుసు, ఆదినమే పెండ్లని. ప్రభూ తనతో చెప్పకపోయినా ఊరిలో పెండ్లి తెలియకపోదూ. ఎంత ఆనందముగా నున్నారు వారందరు. ఆ గుమ్మముమీదే నిలువబడి చూస్తుంది కమల, పెండ్లివారందరిని. ఈ సమయములో తన రాక ప్రభూకి ఒక బాకుపోటులా అయిందనుకుంది. కాని ఆమె యేమిచేయగలదు. ప్రభూ సుఖమేకమూ కోరేదామె. ప్రభూ పెండ్లికూస్తులతో ఎలావుంటాడో! ప్రభూ క్రొత్తవధువు ఎలా ఉంటుందో! ఆమె ప్రభూకి సుఖమివ్వగలదో లేదో!. ఈడు జోడు చూచి యెవరూ ఏమీ అనుకోకుండా ఉంటేచాలు. తన జీవితము ఎలా? ఒక అడవి అగాధము. ఈ సమయములో తను చచ్చి సాధించే దేమీలేదు. అది యింక స్వార్థము, విశ్వాస ఘాతకము పాపము కూడాను. బ్రతికి తన ప్రభూని సుఖపెట్టాలి. ప్రభూ తను యిక్కడికి వచ్చినందుకు తప్పభిప్రాయము పడివుండ వచ్చును. అందుకే భయపడ్డాడనుకుంటాను. ఆయన అంత పిరికిపంద కాడే. ఈ తప్పు తనదే. తనలో ప్రభూను బంధించే శక్తిలేదు. ఎవరిని నిందించిన లాభమేమి.

ఒదిన చెప్పగా విన్నాను, ఆయన నామీద అనుమానపడ్డాడని. ఆరోజు నాకు బాగా జ్ఞాపకముంది. మామయ్య, నేను ఒకేమంచముమీద కూరు

న్నాము. సరాసాగా మాట్లాడేము. ఎన్నో సంవత్సరాలయ్యింది మామయ్యను చూచి. ఒక్కసారిగా ఎన్నో ప్రశ్నలు వేశేను మాయూరిగురించి, మా బంధువులు గురించి. అప్పుడు ప్రభూ వచ్చేడట. కాని నాతో కలియకుండానే తిరిగి వెళ్ళిపోయేడు. నవ్వకనులేకుండా ఉంది. ప్రభూ అంత అవివేకికాడు. ఔదార్య ప్రియుడు. స్వతంత్రాభిలాషి. ఆయన హృదయము కల్మషమైనదికాదు. ఈ అభిప్రాయాలన్నీ నీచగుణాలు గలవారికే. కాని సందేహము మాత్రము వదలలేదు. ఆ దినమునుంచే ప్రభూలో యీ వింతమార్పు కనిపెట్టేను. మాటలో ముభావము గోచరించింది. కలియికలో భేదము మొదలిడింది.

మంగళ ధ్వనులు మొదలిడేయి. పేరంటాళ్ళు పెద్దలు, పిల్లలు—ఒకరేంటి, ఎంతమంది ఉన్నారా పందిరిలో. ప్రభూని యిద్దరు వయస్సులోనున్న పిల్లలే తీసుకువచ్చి పీటలమీద కూర్చొబెట్టేరు. అబ్బా! ఎంత అందముగా ఉన్నాడు, ప్రభూ, రెండో జయంతునిలా.

పెండ్లి కుమార్తెనుకూడా తీసుకువచ్చి కూచో బెట్టేరు. బ్రాహ్మణుల మంత్రాలు, ఆడవారి గోలలు, ఇంకా ఏంటేంటో హడావుడులు.

ప్రభూ అమాంతంగా నావైపు చూచేడు. కండ్లనిండా నీరు నిండియుంది. ఇంక అక్కడ నిలబడలేక పోయేను. ప్రపంచమే క్షణికమనిపించింది. కాని యీ వింతమార్పుకి కారణము మాత్రము తెలిసిందికాదు, ప్రభూని అడగలేదు కూడా. అదే కడసారి చూపు ప్రభూని. మరుచటి నెలలోనే ఆయన మదరాసు వెళ్ళిపోయేడు.





బిటా కేఫిన్
(తలనొప్పి బిళ్ళలు)
అన్ని నొప్పులను, జ్వరములను కుదుర్చును. తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్లనొప్పులు, మలేరియా, స్త్రీల బహిష్ఠునొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును.
వాడుకొనువిధము పొట్లములోనుండును.
పొట్లం 3 బిళ్ళలు 1 అణా.




బిటాలాక్సు
(చాక్‌లెట్ బేది బిళ్ళలు)
సుఖవిరేచనౌషధము
ఇదిచాక్‌లెట్‌బేదిబిళ్లలు, సుఖవిరేచనమును కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.
అన్నిచోట్ల దొరకును.
పొట్లం 2 బిళ్ళలు 1 అణా.

స్టాకిస్టులు :— దాదా అండ్ కంపెనీ, పి. టి. మద్రాస్.

తయారుచేయువారు:

BOMBAY TABLET MANUFACTURING Co., Post Box No. 2092, BOMBAY, 2.